RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 119 | మే 26 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| Nizamabad | Vol: 03 | Vol: 119 | May 26 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరటనిచ్చే కీలక పరిణామం

2

## నీట్ లీక్‌పై సుప్రీం అసహనం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో జరిగిన పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ వివాదంపై స్పందించిన ధర్మాసనం ఎన్‌టీఏతో పాటు కేంద్ర ప్రభుత్వం, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది జరిగిన నీట్ యూజీ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడం పెద్ద ఎత్తున వివాదానికి దారితీయగా, అంతకుముందు 2024లోనూ ఇలాంటి

➤ మిగతా 2వ పేజిలో..

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం

సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్ జనసంఘర్షణ :**
తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, రాబోయే 2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహిళా లోకం ఆర్థికంగా బలోపేతమై కార్పొరేట్ దిగ్గజాలైన అదానీ, అంబానీలను మించిన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ప్రథమమని అభివర్ణించిన ఈ ఉన్నత స్థాయి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి

➤ మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల అరిగోస

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**సిద్దిపేట జనసంఘర్షణ**
ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రంలో రైతాంగం తీవ్ర అరిగోస పడుతోందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ధ్వజమెత్తారు. సాగునీరు, విద్యుత్, యూరియా సరఫరాతో పాటు పండించిన పంటను కొనుగోలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడి వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు ఇంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కోవడం తాము మొదటిసారి చూస్తున్నామన్నారు. తొలుత 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించి, ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితం కావడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం మానేసి, ఢిల్లీ మెడలు వంచైనా ధాన్యాన్ని సేకరించాలని డిమాండ్ చేశారు. మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని ప్రశ్నించిన ఆయన, క్వింటాల్‌కు ఐదు కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. రోహిణి కార్తె ప్రవేశించినా ధాన్యం ఇంకా కళ్లాల్లోనే మురిగిపోతోందని, ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం 50

➤ మిగతా 2వ పేజిలో..

## మరింత ఇంధన భారం

లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంపు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
దేశంలో వాహనదారులపై ఇంధన భారం మరోసారి మోత మోగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇంధన ధరలను మళ్లీ పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 చొప్పున పెంచగా, ఈ పెరిగిన ధరలు సోమవారం నుంచే దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. గత పది రోజుల వ్యవధిలోనే చమురు ధరలు పెరగడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం.

➤ మిగతా 2వ పేజిలో..

## మహారాష్ట్రాలో ఘోర రోడ్డు ప్రమాదం

8 మంది మృతి

**రాయగడ్ జనసంఘర్షణ**
మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో అత్యంత విషాదకర ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మహాబలేశ్వర్ – పొలాద్‌పూర్ మధ్య ఉన్న ప్రసిద్ధ అంబెనాలి ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఒక స్కార్పియో ఎస్‌యూవీ వాహనం అదుపుతప్పి, పక్కనే ఉన్న సుమారు 500 నుంచి 700 అడుగుల లోతైన నదీ లోయలోకి దూసుకెళ్లింది. ఈ భీకర ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రత భారీగా ఉండటంతో ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు లోయలో నుంచి మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

➤ మిగతా 2వ పేజిలో..

## పాక్ మధ్యవర్తిత్వంపై భారతదేశానికి ఎలాంటి అభ్యంతరాలూ లేవు

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం
- భారత్-పాక్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారతదేశానికి ఎలాంటి అభ్యంతరాలూ లేవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన ఆయన, ఇక్కడ జరగబోయే 'క్వాడ్' దేశాల విదేశాంగ మంత్రుల సదస్సులో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన ఆయన భారత్-పాక్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ విషయంలో భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళనలన్నీ ఉగ్రవాద సంస్థల గురించేనని, పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే భారతీయులు ఎక్కువగా ఆందోళన చెందుతుంటారని రుబియో పేర్కొన్నారు. అయితే ఇరాన్ చర్చల్లో పాక్ పోషిస్తున్న పాత్రకు, దీనికి ఎలాంటి సంబంధం లేదని, ఈ మధ్యవర్తిత్వం గురించి భారత్ ఎప్పుడూ ఫిర్యాదు చేయదని తాను భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.



➤ మిగతా 2వ పేజిలో..

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

**మొదటిపేజీ తరువాయి..** తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. సోలార్ ఎనర్జీ రంగంలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని, అలాగే రిలయన్స్ వంటి సంస్థలు నిర్వహించే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా సంఘాల చేతుల్లోనే పెట్టబోతున్నామని వెల్లడించారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 శ్రీఘ్నస్త్రం కు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. పెద్ద పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగ్గొడుతున్న ఈ రోజుల్లో మహిళలు మాత్రం ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారు కాబట్టి, ఇకపై మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ రంగానికి ధీటుగా 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నామని, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా ఇవి నాణ్యమైన వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నాణ్యత లేని చీరలు పొలాల్లో దిష్టిబొమ్మలకు వాడాల్సి వచ్చిందని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా మెరిసిపోతున్నారని వ్యాఖ్యానించారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసినా వెనక్కి తగ్గలేదని, ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి లీజుకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సీఎం పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామని వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల అరిగోస

**మొదటిపేజీ తరువాయి..** లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించిందని పేర్కొన్నారు. పంట కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న 'మిషన్ మోడ్' అంతా నిజానికి 'కమిషన్ మోడ్' అని, కేబినెట్ భేటీలో ధాన్య సేకరణపై స్పష్టమైన ఆదేశాలు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందని అన్నారు. 45 రోజుల్లో రైతుబంధు ఇస్తామని చెప్పి రెండు నెలలు గడిచినా అమలు చేయలేదని, దేవుడిపై ఒట్టు వేసి మాట తప్పిన రేవంత్ రెడ్డి కేవలం 'పేపర్ టైగర్' అని ఎద్దేవా చేశారు. సీఎం ఢిల్లీ పర్యటనలు మాని, ధాన్యం రవాణాకు లారీల ట్రిప్పులు పెంచాలని హితవు పలికారు. ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లలో మార్పు రాకపోతే తానే స్వయంగా కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని, వేలాది మంది రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని హరీష్ రావు హెచ్చరించారు.

## తమిళనాట అన్నా డిఎంకెకు ఝలక్

**ముగ్గరు ఎమ్మెల్యలే రాజీనామా**

**టివికెలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్**

**చెన్నై, మే25 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు

మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

# హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరటనిచ్చే కీలక పరిణామం

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ)తో హైదరాబాద్ మెట్రో రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్ రుణ సదుపాయ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఢిల్లీలో సోమవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలాన్ని చేకూర్చేందుకు ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని అధికారులు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నగర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ కీలక కేంద్రంగా మారుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణ ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మరింత మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ద్వారా సమకూరే రూ.13,600 కోట్ల నిధులను మెట్రోకు సంబంధించి ప్రస్తుతం ఉన్న నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ క్యాపిటల్ రీఫైనాన్సింగ్ కోసం వినియోగించనున్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితితో, త్రైమాసిక వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ఈ రుణ సదుపాయాన్ని కల్పించారు. ఈ రీఫైనాన్సింగ్ ప్రక్రియ వల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న పాత ఆర్థిక భారం గణనీయంగా తగ్గడమే కాకుండా, రాబోయే రోజుల్లో చేపట్టబోయే విస్తరణ ప్రణాళికలకు గట్టి ఆర్థిక వెసులుబాటు లభించనుంది. దీనితో పాటు మరో కీలక పరిణామంగా లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) సంస్థ నుంచి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వంద శాతం యాజమాన్య బాధ్యతలు తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానున్నాయి. దీనివల్ల హైదరాబాద్ మెట్రో ఇకపై పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ఒక ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ మైలురాయిని చేరుకోవడంలో సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ మరియు హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలుపుతూ, నగరంలో సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# నీట్ లీక్‌పై సుప్రీం అసహనం

**మొదటిపేజీ తరువాయి..** ఘటనే చోటుచేసుకోవడంతో ఏటా పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, వైద్య విద్యా ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎన్‌టీఏ నుంచి తప్పించి, ఏదైనా ఒక స్వతంత్ర సంస్థకు అప్పగించాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఎన్‌టీఏ తన వైఫల్యాలను సరిదిద్దుకోకపోవడంపై విచారం వ్యక్తం చేసింది. గతంలో ఈ వ్యవహారం కోర్టుకు వచ్చినప్పుడు ఒక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలను ఎన్‌టీఏ అంగీకరించిందని గుర్తుచేసింది. అయితే ఆ ప్రతిపాదనల అమలుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలతో గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎన్‌టీఏను గట్టిగా ఆదేశించింది.

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

**అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం**

**అధికారులను ఆదేశించిన యూపి సిఎం యోగి**

**లక్నో, మే25** దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలని, సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలన్నారు.

# మరింత ఇంధన భారం

**మొదటిపేజీ తరువాయి..** ఈ వరుస పెరుగుదల వల్ల గడచిన పది రోజుల్లోనే రెండు ఇంధనాల ధరలు లీటరుకు దాదాపు ఎనిమిది రూపాయల వరకు ప్రియమయ్యాయి. ఈ తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరుకుంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా నమోదు కాగా, విజయవాడలో పెట్రోల్ రూ.117.19, డీజిల్ రూ.104.88కు ఎగబాకింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు నిరంతరం పెరగడమే దేశీయంగా ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు, చమురు సరఫరాలో అంతరాయాల కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరుగుతుండటంతో, చమురు సంస్థలు ఆ భారాన్ని నేరుగా వినియోగదారులపైకి నెడుతున్నాయి. అయితే ఈ ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా, రవాణా ఖర్చులు పెరిగి తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు కూడా ప్రియమయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

## పాక్ మధ్యవర్తిత్వంపై భారతదేశానికి ఎలాంటి అభ్యంతరాలూ లేవు

**మొదటిపేజీ తరువాయి..** ఇదే సమయంలో భారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక మరియు ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో కొనియాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మునుపటి కంటే చాలా బలంగా ఉన్నాయని, ప్రస్తుత అమెరికా ప్రభుత్వ హయాం ముగిసే సమయానికి ఈ బంధం మునుపెన్నడూ లేనంత సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మహారాష్ట్రాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** కాగా, ప్రమాదానికి గురైన వాహనం సతారా జిల్లాలోని ఆస్‌గావ్ ప్రాంతానికి చెందినదిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బాధితులంతా సతారా జిల్లా నివాసితులేనని, వారంతా దాపోలి నుంచి సతారాకు తిరిగి వెళ్తుండగా ఈ ఘోరం జరిగిందని ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న స్థానిక పోలీసులు, ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

**పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి**

**కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు**

**న్యూఢిల్లీ, మే25 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# లాయర్ ఖాజా మొయినుద్దీన్ దారుణ హత్య

- న్యాయవాద లోకం దిగ్భ్రాంతి: ఇల్లందులో మౌనం పాటించి నివాళులర్పించిన న్యాయవాదులు
- హైకోర్టు లాయర్ హత్యపై ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్ తీవ్ర ఆగ్రహం
- ఆరోసారి దాడి జరిగినా రక్షణ కరువా? పోలీస్ వైఫల్యంపై ఇల్లందు బార్ ప్రెసిడెంట్ రవికుమార్ నాయక్ నిప్పులు
- రాజకీయ శక్తుల అండతోనే లాయర్ హత్య? 'సిట్' వేయాలని భూక్యా రవికుమార్ నాయక్ డిమాండ్
- వక్ఫ్ భూముల పోరాటమే ప్రాణం తీసిందా? లాయర్ హత్యను ఖండించిన ఇల్లందు బార్ అసోసియేషన్

ఇల్లందు మే 25 (జన సంఘర్షణ)

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు న్యాయవాదుల రక్షణ ఏ స్థాయిలో ఉందో అద్దం పట్టేలా ఒక దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ (63) హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో కారుతో ఢీకొట్టి దారుణంగా హత్యకు గురవ్వడం తీవ్ర కలకలం రేపుతోంది. మే 23, శనివారం నాడు జరిగిన ఈ ఘోర పరాభవం, వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించే న్యాయవాదుల ప్రాణాలకు రక్షణ కరువైందనే చేదు నిజాన్ని మరోసారి బట్టబయలు చేసింది. పక్కా ప్లాన్ ప్రకారం, నెంబర్ ప్లేట్ లేని స్కార్పియో కారుతో నిందితులు ఆయన్ను బలంగా ఢీకొట్టడం చూస్తుంటే, నేరగాళ్లు చట్టాన్ని ఏమాత్రం లెక్కచేయడం లేదని స్పష్టమవుతోంది. తీవ్ర గాయాలపాలైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. దాడి జరగడం ఇది ఆరోసారి అని మృతుడి కుమారుడు పేర్కొనడం గమనార్హం. గతంలో ఐదుసార్లు దాడులు జరిగినా పోలీస్ యంత్రాంగం ముందస్తు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వారి వైఫల్యాన్ని, నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. దశాబ్దాలుగా వక్ఫ్ బోర్డు ఆస్తులు, భూముల రక్షణ కోసం కోర్టులలో చట్టపరమైన పోరాటం చేస్తున్న ఒక సీనియర్ న్యాయవాదికి కనీస భద్రత కల్పించలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. వక్ఫ్ భూములను ఆక్రమించి కాలేజీలు నిర్మించిన ఒక రాజకీయ నాయకుడి హస్తం దీని వెనుక ఉందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, రాజకీయ ముఠాల అండతోనే ఈ తరహా దారుణాలకు తెగబడుతున్నారనే విమర్శలు బలంగా వినబడుతున్నాయి.

ఈ ఘోర హత్యను నిరసిస్తూ ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈరోజు విధులను పూర్తిగా బహిష్కరించారు. కోర్టు విధులకు దూరంగా ఉంటూ లాయర్ల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్



చేశారు. బాధ్యులను పట్టుకోవడంలో అలసత్వం వహిస్తే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాలపై కోర్టులలో పోరాడే న్యాయవాదులకే రక్షణ లేకపోతే, సామాన్య ప్రజలకు న్యాయం ఎలా దక్కుతుందని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశ్నించారు. ఈ కేసుకున్న తీవ్రత, రాజకీయ కోణాలను దృష్టిలో ఉంచుకుని, సాధారణ విచారణతో కాలయాపన చేయకుండా తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ ప్రభుత్వానికి తెగేసి చెప్పారు. ఈ మేరకు హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ కూడా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు లేఖ రాసి ఒత్తిడి పెంచింది. కేసును పక్కదారి పట్టించకుండా, రాజకీయ శక్తులకు లొంగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీస్ శాఖపై ఉంది.

# ఇల్లెందులో 'ప్రతిభా సత్కార మహోత్సవం'

- ఉన్నత లక్ష్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు: ఇల్లెందు 'ఇంపాక్ట్' సభలో ఎంఈఓ ఉమా శంకర్
- క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు: ఎంపిడివో దన్‌సింగ్

ఇల్లందు మే 24 (జన సంఘర్షణ)

ఇల్లెందు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో "ప్రతిభా సత్కార మహోత్సవం" ఘనంగా జరిగింది. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఫస్ట్, సెకండ్ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు, మండల స్థాయి టాపర్లను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఇలాంటి వేదికలపై గౌరవించడం వారి భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుస్తుంది. మండల స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన టీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ విద్యార్థిని పి. ప్రశస్తి, ద్వితీయ స్థానంలో నిలిచిన జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ విద్యార్థిని ఎస్. కె అయేషా, తృతీయ స్థానం కైవసం చేసుకున్న టీ.టీ. డబ్ల్యూ .ఆర్.ఎస్ విద్యార్థిని ఎల్. కీర్తనలకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అయితే, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించడం హర్షణీయమైనప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కొరత వేధిస్తున్నా విద్యార్థులు స్వయంకృషితోనే ఈ విజయాలు



సాధించాల్సి రావడం గమనార్హం. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి ఎమ్. ఉమా శంకర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యావ్యవస్థపై విద్యార్థుల భవిష్యత్తుపై ఆయనకున్న అంకితభావం ఈ సందర్భంగా స్పష్టమైంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆయన, విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కూడిన చదువే సమాజంలో ఉన్నత స్థానానికి చేరుస్తుందని, ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఉమా శంకర్ ప్రబోధాత్మకంగా చేసిన ప్రసంగం విద్యార్థులను, తల్లిదండ్రులను ఎంతగానో ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో దన్‌సింగ్ విద్యార్థులను అభినందించారు. ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ సెక్రటరీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో పాల్గొన్న వివిధ విభాగాల ప్రతినిధులు విద్యార్థులకు మోటివేషన్, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు లక్ష్యాలు, నాయకత్వ లక్షణాలపై విలువైన సందేశాలు ఇచ్చారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు దిశా నిర్దేశం లభిస్తుంది. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, స్కౌట్ మాస్టర్ అజిత్ కుమార్ పాల్గొని వచ్చిన అతిథులకు, తల్లిదండ్రులకు సేవలందించడం ప్రశంసించదగ్గ విషయం. అలాగే సమాజ హితం కోరి ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన దాతలు సతీష్ కండేల్వాల్, మురళీకృష్ణ యాదవ్, విమల గార్ల చొరవ అభినందనీయం. ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి ప్రోత్సహిస్తున్న తరుణంలో, ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిధులు కేటాయించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ పురస్కారాల మహోత్సవంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నప్పటికీ, ఉన్న ఉపాధ్యాయులే అదనపు బాధ్యతలు భుజాన వేసుకుని విద్యార్థులను టాపర్లుగా తీర్చిదిద్దడం వెనుక వారి నిరంతర శ్రమ దాగి ఉందనేది జగమెరిగిన సత్యం. పాలకులు ఇప్పటికైనా స్పందించి విద్యావ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

# ఇల్లందులో ఘనంగా 'కె యూ సి' ఈవీ వాహనాల షోరూమ్ ప్రారంభం

- పర్యావరణ హితమే లక్ష్యం

ఇల్లందు మే 24 (జన సంఘర్షణ)

పెరుగుతున్న ఇంధన ధరలకు దీటైన ప్రత్యామ్నాయంగా, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఇల్లందు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'కె యూ సి' ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల షోరూమ్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని సుభాష్ నగర్, మహీంద్ర ట్రాక్టర్ షోరూమ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ అధునాతన షోరూమ్‌ను ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్, వారి మిత్రులు డానియల్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా కాలుష్య రహిత సమాజం కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో అవసరమని, స్థానిక ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఈవీ బైక్స్, స్కూటర్లు, ఆటోలను ఒకే చోటుకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు అధునాతన సాంకేతికతతో కూడిన వాహనాలను చేరువ చేయాలనే సంకల్పంతో ఈ షోరూమ్‌ను నిర్మించిన ప్రొప్రైటర్ కె. ప్రవీణ్ రాజ్‌ను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. వారి వ్యాపారం మరింతగా విస్తరించి, వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. సరికొత్త మోడళ్లతో, మైలేజీ సామర్థ్యం గల వాహనాలతో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక సుభాష్ నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ-నరసయ్య దంపతులు, ఏక్తా హౌస్ టీం సభ్యుడు మునాఫ్, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొప్రైటర్ ప్రవీణ్ రాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.




# బాల్యం! భలే అద్భుతం!!



తరాలు మారుతున్నా...
మన తలరాతలు మాటలే
దానుకుంటే,పొరపాటే!
"మా తరం"
వందే మాతరం!
బాల్యం! భలే అద్భుతం!
మరువరాణి, మరిలిపోనీ మానసిక రోగం!!
తలిదండ్రులు చెప్పింది
వినయ విధేయతలతో...
తూచ తప్పకుండా ఏమిచెప్పారో...
అదే చేసేవాళ్ళం!
భయమూ, భక్తి,గౌరవం,
వినయం, సౌశీల్యం...
మనిషి! ఎంత ఎదిగినా ముఖంలో...
చెక్కుచెదరని ఆ..అమాయకత్వం మచ్చుకైన...మరలిపోదు!
తలిదండ్రులయెడల భక్తి భావన ఏనాటికీ తరగిపోదు!!

"యువతరం"
అలనాటి... రామాయణం, భాగవతం!
తలిదండ్రుల యొక్క ప్రేమా,
మమకారాళ్ళతో...పెరిగిన
నేపథ్యం! అటువంటిది.
మంచి ఆలోచనలకు ప్రేరణ!
అభ్యుదయ భావాలకు ప్రతీక!

తలిదండ్రుల అడుగుజాడల్లో... నడిచే నడత సద్మార్గాన్నే...
చూపింది!
సద్గురువుల చెంతకు చేర్చింది!!

"ఈ తరం కుర్రోళ్ళు"
తను తలచినదే వేదం!
తను నడచిన నడతే సద్మార్గం!!
ఏది చేయాలో...
అన్న ఆలోచన ఉండదు.
ఎలా ఉండాలో...గుర్తెరగరు
వారి భవితవ్యం ఏమిటో...
వారికే తెలవదు.

పాశ్చాత్య పోకడలకు అర్రులుచాచి, అంబరానంటే ఆడంబరాలకు పోయి జీవితాన్ని...నరకమయం చేసుకోవడం అంటే ఇదే..కదా!

అందం..ఆనందం!
బంధం..అనుబంధం!
చేజారిన తన జీవితంలో...
తిరిగి రమ్మంటే వస్తుందా...
ఆ...యవ్వనం!!

నిజం! కానకా...
వాస్తవాన్ని...తెలుసుకోక
నిజం! మరచి నిద్రపోతే,
తను బ్రతుకే,అంధకారం!
తను జీవితమే, నిరర్థకం!!

పుట్టుకతోనే...
చాలా మంది ఎన్నో...
కలలు కంటారు.
ఆ కలలను కొద్దిమందే సాకారం చేసుకుంటారు.
కలలు కనడం ఒక ఎత్తైతే
వాటిని సాకారం చేసుకోవడం
మరో ఎత్తు!


ఈ మానవ రంగుల వలయంలో...
నీ వొక మానవతా...
దృక్పథానివి!
అద్భుత శిల్పానివి!
ఈ ప్రపంచంలో... ఏ జీవికీ
ఇవ్వనంత మేధస్సునూ...
స్వేచ్ఛా,స్వాతంత్ర్యాలను,
గొప్ప కళాదృష్టినీ నీకిచ్చాడు
ఆ...బ్రహ్మ..!

వీనుల కాంతులు వికసింపసేసిన సృష్టి యావత్తును వీక్షించే మహా అద్భుత దృశ్యం! నీకు కలగడం పూర్వ జన్మ సుకృతం!!
ధర్మాన్ని.. నీవు రక్షించగలిగితే, ధర్మం!
అన్ని వేళలా...నీకు
రక్షణ కవచమై నిలుస్తుంది!!
ధర్మో... రక్షిత, రక్షితః...!

**– మైలపల్లి మమతా నాగరాజు 99668 76796 సాగర్ నగర్, విశాఖపట్నం జిల్లా ఆంధ్ర ప్రదేశ్.**

# నిజామాబాద్ రోహిణి కార్తె ఎండలు జాగ్రత్త

వర్ని: మే 25( జన సంఘర్షణ)




ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భానుడి భగభగలు మోస్రా, చందూర్, వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ 45.7 రోహిత్ కర్త ఎండలు వారం పది రోజులు కొనసాగుతున్నాయి. సోమవారం వచ్చే బుధవారం వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని. వాతావరణం శాఖ వెల్లడించారు. పగటి పూట నమోదైన ఉష్ణోగ్రతల్లో మరింత పెరుగుదల కనిపించింది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 45.7 అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొల్లూరులో 44.5 రికార్డ్ అయ్యింది. దీంతో ఉమ్మడి జిల్లా అంతటా ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. నేటి నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో ఎండలు మరింతగా ఎక్కువ కానున్నాయి.

జన సంఘర్షణ

మంగళవారం
26 మే 2026

# గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక 'డీఎస్సీ' నిర్వహించాలి

- ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టండి: 'ఫీజు నియంత్రణ చట్టం' తేవాలంటూ ఇల్లందులో డిమాండ్



**ఇల్లందు మే 24 (జన సంఘర్షణ)**
దేశంలోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చుతోందని, ఉద్యోగ నోటిఫికేషన్లు సకాలంలో రాక, ఉపాధి దొరకక అభ్యర్థులు తీవ్ర మనోవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు దాపురించాయని ప్రగతిశీల యువజన సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో కామ్రేడ్ లాజర్ అధ్యక్షతన నిర్వహించిన పీవైఎల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో నిరుద్యోగిత, విద్యా రంగంలో దోపిడీ, ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పర్శిక రవి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ వాంకుడోతూ మోతిలాల్ మాట్లాడుతూ, ఉన్నత విద్యాసంస్థలు నేడు జ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా కాకుండా, నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా మారిపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో తక్షణమే ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో హడావుడిగా సేకరించిన 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా వ్యాపారీకరణగా మారిందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్డూఅదుపూ లేకుండా ఫీజుల పేరుతో సాగిస్తున్న దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పీవైఎల్ నేతలు తీవ్రంగా విమర్శించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు విద్యను దూరం చేసేలా ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దందా నడుస్తున్నా, విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించేందుకు తక్షణమే సమగ్రమైన 'ఫీజు నియంత్రణ చట్టాన్ని' తీసుకురావాలని, చట్టాన్ని కఠినంగా అమలు చేసి పేద విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా, ప్రైవేట్ శక్తుల దోపిడీకి కార్పెట్ పరిచే విధానాలను వీడనాడాలని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ ముగియడమే ఆలస్యం.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుడి నడుం విరిచిందని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల సాకుతో ఇక్కడి పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపడం పాలకుల నిరంకుశత్వానికి అద్దం పడుతోందని విమర్శించారు. లీటర్ ఇంధనం ధర పెరిగితే ఆ ప్రభావం నిత్యావసరాలపై పడుతుందని తెలిసి కూడా కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ప్రజలను బలిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన ధరల పెంపు ప్రభావంతో మార్కెట్లో వంటనూనెలు, ఉప్పు, పప్పులు సహా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీనివల్ల రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలు తీవ్ర ఆకలి కేకలతో అలమటిస్తున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కేవలం సంపన్నుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని, తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి, నిత్యావసరాల ధరలను అదుపు చేయాలని కోరారు. మరోవైపు, గ్రామీణ ప్రాంతాల్లో యువతను పక్కదారి పట్టించేలా విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపుల నిర్వహణతో పాటు గంజాయి, హెరాయిన్ వంటి ప్రాణాంతక మాదకద్రవ్యాల రవాణా యథేచ్ఛగా సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువశక్తిని దేశ నిర్మాణానికి ఉపయోగించకుండా, మత్తుకు బానిసలవుతుంటే నిరోధించాల్సిన పోలీస్, ఎక్సైజ్ శాఖలు ఉదాసీనంగా వ్యవహరించడం అత్యంత విచారకరమని విమర్శించారు. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తే సహించేది లేదని పీవైఎల్ నాయకత్వం హెచ్చరించింది. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై నియంత్రణ సాధించకపోతే రాబోయే రోజుల్లో ప్రజా చైతన్యంతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండివైఖరిని వీడకుంటే, గిరిజన ప్రాంతాల నుండి లక్షలాది మంది నిరుద్యోగ యువకులను కదిలించి, రాజధాని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఈ ముఖ్య సమావేశంలో పీవైఎల్ జిల్లా నాయకులు జోగా కృష్ణ, సాధనపల్లి రవి, లాజర్, తాటి రమేష్, కోడెం రవి తదితరులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# న్యాయవాది ఖాజా మోయిన్‌ఉద్దీన్ దారుణ హత్య

- భద్రాచలంలో కోర్టు విధులను సంపూర్ణంగా బహిష్కరించిన బార్ అసోసియేషన్



**భద్రాచలం మే 24 (జన సంఘర్షణ)**
హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మోయిన్‌ఉద్దీన్‌పై జరిగిన దారుణ అమానుష హత్య యావత్ న్యాయవ్యవస్థకే తీరని కలకలం రేపింది. ఈ అనాగరిక ఘటనను తీవ్రంగా ఖండిస్తూ భద్రాచలం బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నాడు న్యాయవాదులు కోర్టు విధులను సంపూర్ణంగా బహిష్కరించారు. భద్రాచలం కోర్టు పరిధిలోని సీనియర్, జూనియర్ న్యాయవాదులందరూ ఉదయం నుంచే స్వచ్ఛందంగా విధులకు దూరంగా ఉండి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేకంగా సమావేశమైన న్యాయవాద లోకం, దివంగత ఖాజా మోయిన్‌ఉద్దీన్ చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, బాధితులకు న్యాయం చేకూర్చేందుకు నిరంతరం శ్రమించే న్యాయవాదులపై పగటిపూట ఇటువంటి దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని ధ్వజమెత్తారు. చట్టాన్ని రక్షించే వ్యక్తులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ అమానుష ఘటనను బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని, ఇది యావత్ సమాజ భద్రతకే ఒక పెద్ద సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ రోజురోజుకూ శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయనడానికి న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, బెదిరింపులే నిదర్శనమని సభలో న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరస్థులలో చట్టం పట్ల భయం లోపించడం వల్లే ఇటువంటి దారుణాలు నడిరోడ్డుపై జరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో న్యాయాన్ని రక్షించేవారే కరువవుతారని హెచ్చరించారు. బాధితుల తరపున వాదించే న్యాయవాదుల ప్రాణాలకే గ్యారెంటీ లేని దుస్థితి దాపురించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. న్యాయవాదులకు వృత్తిగత రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని బార్ అసోసియేషన్ తీవ్రంగా తప్పుపట్టింది. తక్షణమే అసెంబ్లీలో కఠినమైన 'న్యాయవాదుల రక్షణ చట్టాన్ని' ప్రవేశపెట్టి దానికి చట్టరూపం తీసుకురావాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో యావత్ రాష్ట్ర న్యాయవాద లోకం ఏకమై ప్రభుత్వ మొండివైఖరిపై విస్తృత స్థాయి పోరాటానికి వెనకాడబోమని స్పష్టం చేసింది. అలాగే ఈ దారుణ హత్యకు కారణమైన నిందితులను త్వరితగతిన పట్టుకుని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పట్టుబట్టింది. ఈ నిరసన కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ తాతా లలితతో పాటు సీనియర్ న్యాయవాదులు పేరాల వెంకటేశ్వర్లు, బండారు అరుణ్ చంద్, అవులూరి సత్యనారాయణ, భజన సతీష్, ఎంవీ రమ, సాధనపల్లి సతీష్, పాయం రవివర్మ, ఎస్. మల్లేష్, దాట్ల సంధ్య, బి. రామకృష్ణ, వి. రవితేజ, సౌజన్య, చందన, కొత్తపల్లి రాంబాబు, ఎం. శ్రీనివాస్, అరవింద్ తదితర న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## పొతంగల్: మంజీరా నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత




**పోతంగల్/మే 25/( జన సంఘర్షణ)**
పొతంగల్ మండలం కోడిచర్లా గ్రామ పరిధిలో మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టక్టర్ను పోలీసులు ఆదివారం పట్టుకుని కేసు నమోదు. పోలీసులకు తెలిపిన వివరాలు ప్రకారం.. టక్టర్లులో మంజీర నుంచి అక్రమంగా ఇసుకను అక్రమంగా రవాణా తరలిస్తుండగా పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను కోటగిరి పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు.

## ఆస్తి కోసం కన్నతల్లి శవాన్ని ఎత్తుకెళ్లిన పెద్దకొడుకు



**మెదక్/మే 25/(జన సంఘర్షణ)**
తల్లిదండ్రులు బతుకు ఉన్నప్పుడు వారికి గంజినీళ్లు పోద్దామన్న ఆలోచన ఇటు కుమారులకు అటు కుమార్తెలకు పట్టింపు లేదు. కానీ వారు ఆస్తులు మాత్రం వారికి అవసరం. చివరికి కన్న తల్లి చనిపోతే ఆస్తి ఇచ్చేవరకు శవాన్ని ఇచ్చేది లేదంటూ పెద్ద కొడుకు పూడ్చిన శవాన్ని ఎత్తుకు వెళ్ళిన ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన



**జాకోరా కూనిపూర్: మే 25( జన సంఘర్షణ)**
నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రం జాకోర గ్రామం జెడ్ పి హెచ్ ఎస్.పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా గత 22 సంవత్సరాలో అందరూ కలసి జ్. పి. హె. స్.జాకోరా పాఠశాలలో ఎస్. స్.సి. బ్యాచ్ 2003-04 ఘనంగా నిర్వహించడం జరిగింది. దీన్లో గురువులు శివరాజ్, దుర్గ ప్రసాద్, శివ రామ్ ప్రసాద్, శోభన్ బాబు, శివయ్య. చాకోరా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ నంబర్స్. కూనిపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ నంబర్స్ ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలంతా సహకరించిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ కార్యక్రమం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి





**కల్లూర్:మే 25 ( జన సంఘర్షణ )**
నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో కల్లూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కురుమల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం అనంతరం జరిగిన. బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ మాజీ శాసన సభాపతి సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి. ఈ ఆలయ ప్రారంభోత్సవం, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న పోతంగల్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు.

## పొతంగల్ గ్రామం నివాసి అయినాశేట్టి పెద్ద సాయిలు(పులి) అనారోగ్యంతో మృతి

- ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన దాత ప్రకాష్ పటేల్ బిజెపి సీనియర్ నాయకుడు

**పొతంగల్ /మే 25/(జన సంఘర్షణ)**



పోతంగల్ మండలంలోని పాత పోతంగల్ నివాసి అయిన శెట్టి పెద్ద సాయిలు అనారోగ్యంతో మృతి చెందారు. అందుకు బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నాయకులు ప్రకాష్ పటేల్ స్పందించి వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు (బియ్యం, కిరాణా సామగ్రి) అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎంపీపీ గంగాధర్ పటేల్, బూత్ అధ్యక్షులు గోవూరు రమేష్ , కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు ఓమ్మన్న పటేల్, వార్డ్ మెంబర్ సంతోష్ పటేల్, కార్యకర్తలు మార్కలే శివకుమార్ పటేల్, కొట్టాల రమేష్, కుమ్మరి హనుమాన్లు, గోవూరు హనుమాన్లు, సున్నం దేవా, గోవురు ఉల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గత వారం రోజుల క్రితం మంగళి మహేష్ అనారోగ్యంతో చనిపోవడం జరిగింది

- వారి కుటుంబానికి ప్రకాష్ పటేల్ తన వంతు ఆర్థిక సహాయం అందించి ఇంట సరుకులు సాయం చేయడం జరిగింది



**పొతంగల్/మే 25/(జన సంఘర్షణ)**
పోతంగల్ మండల కేంద్రంలో మంగలి మహేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. వారి కుటుంబానికి బిజెపి నియోజకవర్గ నాయకులు మర్కెల్లి ప్రకాష్ పటేల్ స్పందించి వారి కుటుంబానికి పరామర్శించడం జరిగింది. వారి కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మార్కెల్లి గంగాధర్ పటేల్, రెండవ వార్డ్ మెంబర్ సంతోష పటేల్, బూత్ అధ్యక్షులు గోవూరు రమేష్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఓమన్నపటేల్, గంధపు హనుమాన్లు, శివ కుమార్ పటేల్, కొట్టాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిచ్కుంద పీఠాధిపతి, పరమ పూజ్యులు సోమలింగ శివాచార్య మహారాజ్ జన్మదిన వేడుకలు

బిచ్కుంద/మే 25/(జన సంఘర్షణ)



బిచ్కుంద పీఠాధిపతి, పరమ పూజ్యులు సోమలింగ శివాచార్య మహారాజ్ జన్మదిన సందర్భంగా బిచ్కుంద మండల కేంద్రంలోని బండాయప్ప మఠానికి వెళ్లి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు. ఈ సందర్భంగా మహారాజ్ ఆశీస్సులు స్వీకరించి, వారు సమాజంలో ఆధ్యాత్మిక విలువలు, సేవాభావం పెంపొందించడంలో చేస్తున్న కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. ఆయురారోగ్యాలతో, ఆనందంతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్ మండల కేంద్రంలో మహిళ సంఘం భూమి పూజ కార్యక్రమం


పోతంగల్/మే 25/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మహిళ ఇందిరమ్మ భవనాల నిర్మాణంలో భాగంగా పొతంగల్ మండల కేంద్రంలో మహిళ సంగం భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోతంగల్ గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి, గ్రామ సెక్రెటరీ యాదవ్, వివో ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, ధనరాజ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళల సమావేశం కొరకు మహిళ భవన సంఘం నిర్మిస్తున్నామని తెలిపారు.

## ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ఆదేశాలు మేరకు మద్నూర్‌లోని ఎస్సీ కాలనీలో అంగన్వాడీ భవనం కొరకు స్థలం భూమి పూజ చేయడం

జుక్కల్ మద్నూర్/మే 25/(జన సంఘర్షణ)



జుక్కల్ ఎమ్మెల్కే లక్ష్మి కాంతారావు ఆదేశాలు మేరకు మద్నూర్‌లోని ఎస్సీ కాలనీలో అంగన్వాడీ భవనం కొరకు స్థలం భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మద్నూర్ గ్రామ సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రీ, మద్నూర్ గ్రామ ఉప సర్పంచ్ రమేష్ వట్నాల్ వార్, పంచాయత్ రాజ్ అరుణ్, మద్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, మద్నూర్ 11 వార్డ్ సభ్యులు జ్ఞానేశ్వర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జుక్కల్ మండలం నాగల్గావ్ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


జుక్కల్/మే 25/(జన సంఘర్షణ)



జుక్కల్ మండలం నాగల్గావ్ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని పేర్కొన్నారు. చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పొతంగల్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మూడో వార్డులో బోరు వేయడం జరిగింది

(పాత)పోతంగల్/మే 25/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని మూడో వార్డులో ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం వలన త్రాగు నీటి సమస్య ఏర్పడుతుందని గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి ఈరోజు బోర్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి, వార్డ్ మెంబర్లు పులకంటి సాయిలు, మరికల సంతోష్ పటేల్, గంధపు సంధ్య, మాజీ ఉపసర్పంచ్ సుదం వినోద్, గంధపు హనుమడ్లు, గంధపు గంగల్త, ఒమన్న పటేల్, వడ్ల సంతోష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ భర్త మధు హత్య కేసు ఛేదన.. ఐదుగురు అరెస్ట్

సూర్యాపేట జిల్లా/మే 25/(జనసంఘర్షణ)

సూర్యాపేట: జిల్లాలో సంచలనం సృష్టించిన యర్కారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో మహిళా నిందితురాలు పరారీలో ఉన్నట్లు జిల్లా పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ నరసింహ సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు దర్యాప్తు వివరాలను వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి ఒక కారు, ఒక బైక్, హత్యకు ఉపయోగించిన కత్తి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అరెస్ట్ చేసిన నిందితులు:

1మిద్దె జీవన్ (27) -యర్కారం గ్రామం..
2చింత సైదులు (45) - రామన్నగూడెం...
3మేదరి ప్రసాద్ (34) - యర్కారం...
4మిద్దె ఆనంద్ (24) - యర్కారం...
5కక్కిరేణి భరత్ చంద్ భరత్ (21) - తాళ్లగడ్డ...."

మరో మహిళా నిందితురాలు ముల్కలపల్లి భవాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మిస్సింగ్ కేసు నుంచి హత్య కేసుగా....**

యర్కారం గ్రామానికి చెందిన 42 ఏళ్ల చింతలపాటి మధు శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ముందుగా మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. అయితే శనివారం ఉదయం గ్రామ శివారులోని కల్వర్టు కింద గోనె సంచిలో మధు మృతదేహం లభించడంతో కేసును హత్య కేసుగా మార్చి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు.

**ప్రతీకారంతో హత్య....**

2007లో యర్కారం మాజీ సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో మధు ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, ఆ కక్షతో రవీందర్ కుమారుడు మిద్దె జీవన్ ప్రతీకారం తీర్చుకోవాలని ప్లాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జీవన్ తన స్నేహితులు చింత సైదులు, మేదరి ప్రసాద్ సహకారంతో మధును హత్య చేసేందుకు పథకం రచించినట్లు తెలిపారు. గతంలో రెండు సార్లు ప్రయత్నించినా విఫలమయ్యారని చెప్పారు.


**మందు పార్టీ పేరుతో పిలిచి హత్య....**



శుక్రవారం చేపలు, మద్యం పార్టీ పేరుతో మధును తాళ్లగడ్డలోని అద్దె ఇంటికి పిలిచారు. మధు మద్యం మత్తులో ఉన్న సమయంలో జీవన్, ఆనంద్ అక్కడికి చేరుకున్నారు. ప్రసాద్ మధు చేతులు, కాళ్లు పట్టుకోగా సైదులు దాడి చేశాడని, అనంతరం జీవన్ మటన్ కత్తితో మెడ, ముఖం, భుజాలపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి కారులో యర్కారం శివారులోని కల్వర్టు కింద పడేసినట్లు చెప్పారు. మధు బైక్‌ను మరో ప్రాంతంలో వదిలేసి, హత్యకు ఉపయోగించిన కత్తి, సెల్‌ఫోన్‌ను అడివేముల శివారులో పారేసి నిందితులు పరారయ్యారని వెల్లడించారు.

## వర్ని: చెట్టును ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

వర్ని/మే 25/(జన సంఘర్షణ)



నిజామబాద్ జిల్లా వర్ని మండలం మల్లారం వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం, బిచ్కుంద మండల్ అర్జునులు గ్రామానికి చెందిన ప్రశాంత్ కు బైక్ పై వెళుతుండగా చెట్టు ఢీ కొట్టడంతో తలకు తీవ గాయాలయ్యాయి. అంబులెన్స్ 108 సిబ్బంది రాధాకృష్ణ గౌస్ ప్రథమ చికిత్స చేసి నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కొత్తపల్లి రవికిరణ్ 11 వేల రూపాయలు విరాళం

రుద్రూర్: మే 25( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయం. కొత్తపల్లి రవి కిరణ్. 11 వేల రూపాయలు విరాళంగా అందజేశారు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో భాగంగా రుద్రూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తపల్లి రవి కిరణ్ ఆలయ కమిటీ నిర్వాహకులకు 11 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కొత్తపల్లి రవి కిరణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఇరిగేషన్ ఈఈ

- ఏసీబీకి చిక్కిన భారీ తిమంగళర
- ఐదు రోజుల్లో నలుగురు భారీ అవినీతి తిమంగలాలు



హనుమకొండ వరంగల్/మే 25/(జన సంఘర్షణ)

ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రజా సేవకులు. కానీ ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు కాసులకు కక్కుర్తి పడి భారీ ఎత్తున అవినీతి అక్రమాలకు చోటు కల్పిస్తున్నారు. ఈ ఐదు రోజుల్లో భారీ అవినీతి అధికారులు ఏసిబికి చిక్కారు. భారీ తిమ్మంగలాలు ఏసీబీకి చికడం పట్ల తెలంగాణ రాష్ట్రంలో ఏ స్థాయిలో అవినీతి చోటు చేసుకుంటుందో అర్థమవుతుంది. తాజాగావరంగల్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు జరిపిన దాడిలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పాలకుర్తిలో ఇరిగేషన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న గంటి శ్రీకాంత్, హన్మకొండ భవానీనగర్‌లోని తన నివాసంలో ఒక కాంట్రాక్టర్ నుండి రూ. 50,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి, ఎంబీ రికార్డులలో తుది కొలతలను నమోదు చేయడానికి సదరు అధికారి ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, రసాయనాలతో కూడిన లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుడైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నారు.

# ఇల్లందు అభివృద్ధికి 50 కోట్ల నిధులు ఇవ్వండి

- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కోరం కనకయ్య వినతి

ఇల్లందు మే 24 (జన సంఘర్షణ)

ఇల్లందు పురపాలక సంఘాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామంటూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎట్టకేలకు అడుగులు ముందుకు వేశారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పెండింగ్ ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు.య ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే అస్త్రంగా చేసుకుని, పురపాలక ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయాన్ని సీఎం దృష్టికి కనకయ్య తీసుకెళ్లారు. అయితే, ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్న తరుణంలో ఎమ్మెల్యే ఈ భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేవలం గెలుపును గుర్తు చేస్తూ నిధులు కోరడమే కాకుండా, వాటిని సకాలంలో రాబట్టడమే ఇప్పుడు ప్రజాప్రతినిధి ముందున్న అసలైన సవాల్. ముఖ్యంగా ఇల్లందు పురపాలకంలో దశాబ్దాలుగా వేధిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య, తాగునీటి పైప్‌లైన్ల విస్తరణ, నీటి శుద్ధి కేంద్రాల (వాటర్ ప్యూరిఫికేషన్) ఆధునికీకరణ వంటి కీలక అంశాలను ఎమ్మెల్యే ఈ వినతిపత్రంలో పొందుపరిచారు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్నప్పటికీ, దానికి తగ్గట్టుగా మౌలిక వసతులు మెరుగుపడక పోవడంపై పౌరుల్లో కొంత అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలో, కనీస అవసరాలైన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అభినందనీయమైనప్పటికీ.. ఈ ప్రతిపాదనలు నిధుల మంజూరు దశను దాటి ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయో వేచి చూడాలి. వీటితో పాటు పురపాలక పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆధునిక పరికరాల కొనుగోలు, దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పునర్నిర్మాణంతో పాటు కొత్త నిర్మాణాల మంజూరుకు నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. పట్టణంలో అధ్వాన్నంగా మారిన రహదారుల వల్ల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్న మాట వాస్తవం. నిధుల కొరత నెపంతో కాలయాపన చేయకుండా, ఈ



ప్రతిపాదనలకు తక్షణమే బడ్జెట్ లైన్ క్లియర్ చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఇల్లందు ప్రజల చిరకాల ఆకాంక్షలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఈ భేటీపై నియోజకవర్గ వ్యాప్తంగా సానుకూల స్పందన వస్తోంది. వినతిపత్రంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల నుంచి హామీలు రావడం కొత్తేమీ కాకపోయినా, ఈ రూ. 50 కోట్ల నిధుల మంజూరు ఫైలుపై సీఎం ఎప్పుడు సంతకం చేస్తారు, ఇల్లందు మున్సిపాలిటీ రూపురేఖలు ఎప్పుడు మారుతాయనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
26 మే 2026

## కార్పొరేట్ గుప్పిట్లో సర్కార్? ఫీజుల నియంత్రణపై పాలకుల నిర్లక్ష్యంపై 'పిడిఎస్ యూ' సమరభేరి

ఇల్లందు మే 24 (జన సంఘర్షణ)

రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ పతాక స్థాయికి చేరినా, పాలకులు ముద్దునిద్ర వీడకపోవడంపై విద్యార్థి లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ సామాన్యుడికి చదువును దూరం చేస్తున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం బస్టాండ్ ప్రాంగణంలో పిడిఎస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లకు లొంగిపోకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఈ ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు పలకడం క్షేత్రస్థాయిలో ఉన్న తీవ్ర అసంతృప్తికి అద్దం పడుతోంది. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులే నేడు ప్రభుత్వాన్ని నియంత్రించే స్థాయికి ఎదిగాయని సంచలన ఆరోపణలు చేశారు. శ్రీ చైతన్య, నారాయణ వంటి బడా విద్యాసంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే ఎలక్ట్రోరల్ బాండ్ల తాయిలాలకు అలవాటు పడే, పాలకులు ఫీజుల నియంత్రణకు వెనుకాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రతి ఏటా నిస్సిగ్గుగా 25 నుంచి 50 శాతం ఫీజులు పెంచుతున్నా, క్షేత్రస్థాయిలో ఉన్న ఎంఈఓలు, డిఈఓలు, ఆర్జేడీలు ప్రైవేటు యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం విద్యావ్యవస్థలోని అవినీతి నెట్‌వర్క్‌ను స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో తల్లిదండ్రుల కమిటీలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించి, వారి అనుమతితోనే ఫీజుల సవరణ జరిగేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ సంతకాల సేకరణ ద్వారా ప్రజల ఆగ్రహాన్ని ప్రభుత్వానికి రుచి చూపిస్తామని,




రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పిడిఎస్ యూ నాయకులు హెచ్చరించారు. ఫీజు నియంత్రణ కమిటీ ఏర్పాటు అనేది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఆచరణలో కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ నిరసన కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, జిల్లా కార్యదర్శి సాధన పల్లి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వాసు తదితరులు పాల్గొని విద్యార్థి హక్కులకై గళమెత్తారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయడమే తన లక్ష్యం

- ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్/మే 25/(జన సంఘర్షణ)



రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లతో పాటు మహిళలు వ్యాపార రంగంలో మరింతగా రాణించడానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బ్యాంకుల నుంచి వీటికి అవసరమైన రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ధనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , పలువురు ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలకు అందించే ఇందిరమ్మ చీరల డిజైన్లను ముఖ్యమంత్రి కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవడానికి మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం అవసరమైన స్థలం గుర్తించి మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుపైన ఇవ్వడానికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి" అని మంత్రి పొంగులేటి కి చెప్పారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కార్పస్ ఫండ్ ఇస్తామని, సంఘాల్లోని ప్రతి మహిళ కొంత మేరకు పెట్టుబడిని సమకూర్చుకోవాలని సూచించారు.



"కార్పొరేట్ కంపెనీలు నడిపిస్తున్న చైన్ సూపర్ బజార్లలో వస్తువులను అత్యధికంగా కొనుగోలు చేసేది మహిళలే. నిత్యవసర వస్తువులు, అత్యవసర వస్తువులు ఏవైనా నాణ్యమైన వస్తువులు కొనాలంటే మహిళా శక్తి బజార్లలో కొనాలి అనే విధంగా బ్రాండ్ ఇమేజీని సాధించాలి. దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా రాణించాలి" అని అభిలషిస్తూ అందుకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. "రైస్ మిల్లులను స్వయంగా మీరే పెట్టుకోండి. అదే విధంగా లాజిస్టిక్ సెంటర్లను కట్టుకోండి. మండలాల్లో స్థలాలు ఇచ్చే బాధ్యత నాది. పెద్ద గోడౌన్లు కట్టుకోండి. భవిష్యత్‌లో బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. కొత్త మంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. వాటిని ఆడబిడ్డలకు ఇవ్వడం ద్వారా జవాబుదారీతనంగా ఉంటారు. భవిష్యత్‌లో ప్రతి మండలంలో పెద్ద పెద్ద గోడౌన్లు కట్టడం ద్వారా ధాన్యం వాటిల్లో భద్రపరుస్తాం. మహిళల దగ్గర నుండే మిల్లర్లు తీసుకెళ్లాలి. ప్రతి మండలంలో 2 నుండి 4 స్థలాలను గుర్తించి గోడౌన్లు నిర్మించుకోవడానికి ఏ విధమైన ప్రణాళిక అవసరమో కలెక్టర్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశిస్తున్నా. అందుకు అవసరమైన స్థలాలు ఇచ్చే పూచీ నాది. ఇందుకు అవసరమైన రుణాలను జీరో వడ్డీతో బ్యాంకు లింకేజీ కూడా సహకారం ఇస్తాం" అని చెప్పారు "మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుంది. మహిళలు స్వశక్తి మీద నిలబడటానికి, ఆర్థికంగా ఎదగడానికి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడానికి తీసుకున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా 29 నెలల్లో రూ. 10 వేల కోట్లకు పైగా సంస్థకు చెల్లించాం" అని పేర్కొన్నారు. "ఇందిరాగాంధీ స్త్రీ శక్తి అంగన్ వాడీ భవనాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, అద్దెపై ఆర్టీసీకి ఇవ్వడానికి బస్సులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ఈ వారంలో చేపడుతున్నాం. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు 8 వేల భవనాలను ఒకే రోజు శంకుస్థాపన చేసుకుని దేశంలోనే ఒక గొప్ప కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించుకున్నాం" ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మంత్రులు, అధికారులను అభినందించారు. మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి తద్వారా అద్దె రూపేణా నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు వేశాం. అందులో భాగంగా జూన్ 5వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి మరో 553 బస్సులను అందించబోతున్నాం" అని ప్రకటించారు. ఆడబిడ్డలకు బ్యాంకు రుణాల లింకేజీ ఇవ్వడమే కాకుండా, వ్యాపారంలో రాణించడానికి, వారికి కావలసిన వ్యాపారాలు వారు వృద్ధి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 29న వీ-హబ్ ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ కింద అవసరమైన వ్యాపారాల ప్రణాళికలను అందించే కార్యక్రమం చేపడుతున్నాం" అని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నాం. మహిళా సంఘాల రుణాలపై జీరో వడ్డీ కింద ప్రభుత్వం రూ. 1390 కోట్లు చెల్లించింది. చెల్లింపుల్లో నిర్మల్ జిల్లా నూటికి శాతం నూరు శాతం చెల్లించారని" చెబుతూ ఆ జిల్లా మహిళలను ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జిల్లాల మహిళా ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే పంటల మార్పిడి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. '2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మంత్రిమండలి మొత్తం మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది..' అని ముఖ్యమంత్రి అన్నారు.

## జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం




హైదరాబాద్,/మే25/(జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపింది. శనివారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 11వ, 12వ తరగతి విద్యార్థులకు ఈ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. అలాగేఇందిరమ్మ ఇళ్లు' రెండో దశలో భాగంగా మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొదటి దశలో ఇప్పటికే రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోయర్ ఇన్‌కమ్ గ్రూప్‌ప్రజల కోసం మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. ఇకరాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో "నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30"కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది కేంద్ర ప్రభుత్వ =ఊూా పథకంలో రాష్ట్ర డిస్కంలు భాగస్వామ్యం కావడానికి కూడా కేబినెట్ అనుమతి ఇచ్చింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే దీని లక్ష్యమని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ తదితర పనులకు రూ.587 కోట్ల మంజూరుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు

కామారెడ్డి/మే 25/(జన సంఘర్షణ)





కామారెడ్డి జిల్లా ఆదివారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం నర్సింలు ( 30 ) ని ఉగ్రవాయి హ్యాండ్ ఫ్రాక్చర్ .నందికా 11 మైనర్ : 6 ఆరవ తరగతి గ్రామం ఉగ్రవాయి - మైనర్ గాయాలయ్యాయి. మంజుల ( 26 ), మైనర్ గాయాలు అయ్యాయి. రామారెడ్డి లో బీరప్ప పండుగ చేసుకొని ఇంటికి వస్తుండగా , పటేల్ చెరువు కట్ట పైన ట్రాక్టర్ బోల్తా పడగా ట్రాక్టర్ డ్రైవర్ కు అతని కూతురుకు అతని భార్యకు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుక వచ్చారు. వీరి ముగ్గురికి ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## పీఎం శ్రీ పోతంగల్ పాఠశాల యందు సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం


పోతంగల్/మే25/( జన సంఘర్షణ)



ఈరోజు పీఎం శ్రీ పోతంగల్ పాఠశాల యందు సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి లోల శంకర్, పోతంగల్ హెచ్ఎం సాయిలు, పోతంగల్ గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య, ఏఏపీసీ చైర్మన్ అనురాధ, మాజీ ఎంపీపీ పవన్, మాజీ సర్పంచ్ గంట్ల విఠల్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు రామారావు, హనుమాన్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టిసిపేట్ అయినటువంటి ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. అదేవిధంగా బోధించిన ఇన్స్ట్రక్టర్లకు సన్మానం చేయడం జరిగింది.

## వడదెబ్బ ముసుగులో భర్తను చంపిన భార్య!


విశాఖపట్నం/మే25/( జన సంఘర్షణ,)



విశాఖపట్నం భీమిలి మండలంలో నాగమణి అనే మహిళ తన భర్త సూరిబాబును చున్నీతో మెడ బిగించి హత్య చేసింది. అనంతరం వడదెబ్బతో పడిపోయాడని నమ్మించి ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల తనిఖీల్లో అసలు నిజం బయటపడింది. పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేశారు. కుటుంబ కలహాలా లేక ఇన్సూరెన్స్ డబ్బుల కోసమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## తమిళనాడు రాష్ట్ర మంత్రిగా ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన పి. విశ్వనాథన్ ..

హైదరాబాద్ జూబ్లీహిల్స్/25/(జన సంఘర్షణ)



జూబ్లీహిల్స్ తమిళనాడు రాష్ట్ర మంత్రిగా ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన పి. విశ్వనాథన్ నేడు హైదరాబాద్‌లో పర్యటించారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా కలిసిన పి. విశ్వనాథన్‌కి సీఎం రేవంత్ రెడ్డి శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. విశ్వనాథన్ కొత్త బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక భేటీలో ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలు, పలు రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు కాసేపు చర్చించినట్లు సమాచారం.

## నూతనంగా ఏర్పడిన ఆత్మ కమిటీ చైర్మన్‌గా మాసాని రవీందర్ రెడ్డి

- కమిటీ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు

బాన్సువాడ ప్రతినిధి/మే 25/(జనసంఘర్షణ)



బాన్సువాడ పట్టణ కేంద్రంలోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయం ( ాూఞాా ) లో ఆత్మ కమిటీ చైర్మన్ , సభ్యుల పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ శ్రీ కాసుల బాలరాజు, ఆత్మ కమిటీ చైర్మన్‌గా శ్రీ మాసాని రవీందర్ రెడ్డి , కమిటీ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండల, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు,అ ధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించాలి

**జిల్లా కలెక్టర్ ను కోరిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు**

**హనుమకొండ:**



హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్కు సమర్పించిన వినతిపత్రంలో జర్నలిస్టుల పిల్లలు ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో జర్నలిస్టు కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అందువల్ల గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరానికి కూడా జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సంబంధిత అధికారులకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి డీఈఓను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జిల్లా కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ బొల్లారం, కోశాధికారి అమర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కంకణాల సంతోష్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విఫలం

**పదేపదే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి కార్పొరేట్లకు అండగా మోడీ**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**వరంగల్ ::**



కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేపదే ప్రజలపై భారాలు మోపుతున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన 12 రోజుల వ్యవధిలో 8 రూపాయల వరకు పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున భారాలు మోపిన ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమేనని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని పేర్కొన్నారు. పదే పదే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి కార్పొరేట్ లకు మోడీ అండగా నిలుస్తున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే కేవలం వాహనాలు నడిపేవారే నష్టపోరని, అది ప్రజల దైనందిన బడ్జెట్ను నేరుగా దెబ్బ తీస్తుందని తెలిపారు. లారీలు, రవాణా వాహనాల ఖర్చులు పెరుగుతాయని, దీనివల్ల కూరగాయలు, పాలు, పప్పులు, మందులు వంటి అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆటోమేటిక్గా పెరిగిపోతాయని తెలిపారు. అలాగే వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని, మన దేశంలో వ్యవసాయం చాలా వరకు డీజిల్ ఇంజన్లు, ట్రాక్టర్లపై ఆధారపడి ఉందని, డీజిల్ ధరలు పెరిగితే రైతులకు పెట్టుబడి ఖర్చు భారీగా పెరుగుతుందని, ఇది దేశ ఆహార భద్రతకే ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని చెబుతూనే ప్రజలపై పెనుభారాలు మోపు చున్నారని, భారాలు బిజెపి ప్రభుత్వాన్ని, ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులతో గ్రామస్తులతో జ్యూస్ తాగుతూ తాటి....




**చంద్రుగొండ:**

చంద్రుగొండ మండల కేంద్రంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి జ్యూస్ దుకాణం వద్ద ఆగి గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు, సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి కూర్చుని జ్యూస్ తాగుతూ వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో ఎదురవుతున్న సమస్యలు, రైతాంగానికి సంబంధించిన ఇబ్బందులపై లోతైన చర్చ జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం అనే దృఢ సంకల్పంతో, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు నిరంతరం ప్రజల్లో ఉండి వారి కోసం పోరాడాలని తాటి వెంకటేశ్వర్లు, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరుకుళ్ళ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గూగులోత్ రమేష్, చిన్నం రామకృష్ణ, గాదె లింగయ్య, సత్తి నాగేశ్వరరావు, సంకా కృపాకర్, వంకాయలపాటి బాబురావు, పవన్ కుమార్, అనుమాల హనుమంతరావు, రామిశెట్టి సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి కృషి

**- అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోత్కూరి శ్రీహిత్ బాబీ**

**ఉప్పల్ :**

ఉప్పల్ డివిజన్ను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారని ఉప్పల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోత్కూరి శ్రీహిత్ బాబీ పేర్కొన్నారు. కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ బురుజు గల్లీలో రూ.92 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. భరత్ నగర్ బురుజు గల్లీలో ఎన్నో సంవత్సరాలుగా స్థానికులు ఎదుర్కొంటున్న రహదారి, మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. భారీ నిధులతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే కాలనీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు మురుగు నీటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు ఉపయోగపడేలా పనులు పూర్తి చేయాలని సంబంధిత



అధికారులకు సూచించినట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా మోత్కూరి శ్రీహిత్ బాబీ మాట్లాడుతూ, ఉప్పల్ డివిజన్లోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఉప్పల్ డివిజన్ను సమస్యలు లేని ఆదర్శ డివిజన్గా తీర్చిదిద్దేందుకు కార్పొరేటర్ నిరంతరం ప్రజలతో మమేకమై అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని



పేర్కొన్నారు. కాలనీ ప్రజలు కూడా జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిత్తు రెడ్డి, పాలడుగు లక్ష్మణ్, పిన్నిటి శ్రీనివాస్ రెడ్డి, పిన్నిటి మహిపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, శ్రీకర్ శర్మతో పాటు

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, రాష్ట్ర బృందం...

- కేటీపీఎస్ పాత స్టేషన్ల స్థానంలో కొత్తగా 2/800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మించాలి....
- కిన్నెరసాని పర్యాటక రంగ అభివృద్ధికి, బడ్జెట్ హోటల్ పనులకు నిధులు మంజూరు చేయాలి....
- ముర్రేడు వాగు రక్షణ గోడ నిర్మాణానికి, సీతారామ ప్రాజెక్ట్ కాలువల పొడిగింపునకు బడ్జెట్ కేటాయించాలి....
- నియోజకవర్గానికి సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలి....
- కొత్తగూడెంలో గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి...
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పాల్వంచ సీహెచ్సీని 100 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం :**

కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే



ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సిపిఐ రాష్ట్ర ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ఎ, బి, సి స్టేషన్ల స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్ను నిర్మించాలని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ భవనాలను మంజూరు కోరామన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీని "కొత్తగూడెం--పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్"గా మార్చాలని కోరామని, కిన్నెరసాని ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి, హరిత రిసార్ట్, బడ్జెట్ హోటల్ ముగింపు పనులకు అదనపు నిధులు ఇవ్వాలన్నారు. ముర్రేడు వాగు రీన్ఫోర్స్డ్ సాయిల్ వాల్ నిర్మాణానికి ?50.50 కోట్లు, సింగభూపాలెం, చింతల చెరువు ఆధునీకరణకు నిధులు క్లియర్ చేయాలని, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపిణీ కాలువల డిజైన్ మార్చాలని కోరారు. విద్యా, క్రీడారంగాల కోసం 20 ఎకరాల్లో సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ పనులకు 1160 లక్షలు, గిరిజన మహిళా డిగ్రీ కాలేజీ భవనానికి 30 కోట్లు మంజూరు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణానికి ?25 కోట్లు, సుజాతనగర్ జూనియర్ కాలేజీ, కొత్త ఐటీఐలలో సిబ్బందిని కేటాయించాలన్నారు. వైద్య సేవల్లో భాగంగా పాల్వంచ సీహెచ్సీని 100 పడకలకు అప్గ్రేడ్ చేయాలని, జీజీహెచ్ కొత్తగూడెంలో కాత్ ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యాలు కల్పించి, పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెం.76 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ, పెండింగ్ పోడు భూముల పట్టాల సమస్యను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను విడుదల చేయాలని కోరారు. కొత్తగూడెంలో గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని, పాస్పోర్ట్ ఆఫీస్, మైలారం రాగి గని పునఃప్రారంభం, పాండురంగాపురం-భద్రాచలం రైల్వే లైన్ సాధన, డీఎంఎఫ్ టీ నిధుల విడుదల అత్యంత అవసరమన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి, ఎంఆర్ఓ, జెడ్పీ, ఎంపీడీఓ శాశ్వత కార్యాలయ భవనాలకు నిధులు ఇవ్వాలని కోరారు. చివరగా నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాము అందించిన వినతిపత్రంలో అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

# ఘనంగా స్వేరోస్ విక్టరీ డే సంబరాలు

**శంకరపట్నం :**

మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం కాకతీయుల రాజుల కాలం నాటి ప్రసిద్ధిగాంచిన మొలంగూర్ ఖిలా గుట్ట వద్ద దూద్ బావి ఆవరణంలో కరీంనగర్ స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వేరోస్ విక్టరీ డే సంబరాలను ఘనంగా నిర్వహించి. మొలంగూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, స్వేరోస్ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకులు మాట్లాడారు. మలావత్ పూర్ణ ఆనంద్ 2013 మే 25న ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహిం చి జాతీయ జెండాను, అంబేద్కర్, ఎస్ ఆర్ శంకరన్ చిత్రపటాలను నిలిపారని అన్నారు. అంత చిన్న వయసులోనే ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కే విధంగా ప్రోత్సహించిన సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల కార్యదర్శిగా ఉన్న అభివృద్ధి ఇప్పుడు జరగడం లేదని విమర్శించారు. స్వేరోస్ నాయకులు ప్రతి సంవత్సరం విక్టరీ డే సంబరాలు జరుపుతామని తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులను గొప్ప స్థాయి కి తీసుకు వచ్చిన ఘనత డాక్టర్ అర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గారికే దక్కింది అని



కొనియాడారు. అనంతరం మొలంగూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివిన మోరే మనోహర్ క్లిక్ బుక్ డాట్ కం. వెబ్ సైట్ ను క్రియేట్ చేసిన మనోహర్ కు శాలువతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షులు జట్టిపల్లి అనిల్, స్వేరోస్ నెటవర్క్ రాష్ట్ర కో కన్వీనర్ గడప రాజు, మాజీ సీనియర్ టిటిసి అధ్యక్షులు గొర్రె చిరంజీవి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాతంగి మారుతీ, మాతంగి రోహిత్, నాయకులు మహిపాల్, మోరే శ్రీను, మాతంగి చరణ్ తేజ్, తరుణ్, యస్వంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
26 మే 2026

## ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భేటీ

**-ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి,ఎల్‌వోసీలు,ముఖ్యమంత్రి సహాయ నిధిపై కీలక చర్చ**



**ఉప్పల్**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతమివ్వాలనే లక్ష్యంతో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాల యంలో ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్న వేముల శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగినట్లు తెలిసింది.ఉప్పల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఎల్‌వోసీల మంజూరు, నిధుల విడుదల, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రధానంగా ప్రస్తావిం చినట్లు సమాచారం. ప్రజలకు అవసరమైన రహదారులు, కాలువలు, మురుగునీటి వ్యవస్థలు, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగవంతం కావడానికి ప్రభుత్వ సహకారం అవసరమని వివరించినట్లు తెలిసింది.అలాగే పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ఎంతో ఉపయో గపడుతున్న ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, త్వరితగతిన ఆర్థిక సాయం అందే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఎమ్మెల్యే చర్చించినట్లు సమాచారం. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది.ఈ సందర్భంగా వేముల శ్రీనివాసులు ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని పేర్కొన్నట్లు తెలిసింది.భేటీ అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం చూపించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతం చేసి ఉప్పల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సహకారంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.ఉప్పల్ నియోజకవర్గానికి మరిన్ని నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి ప్రభుత్వం ఉన్నతాధికారులతో తరచూ సమన్వయం కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు సమాచారం. ఈ భేటీతో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు త్వరలోనే ముందుకు సాగే అవకాశం ఉందని స్థానిక నాయకులు భావిస్తున్నారు.

## మద్దెల బాబు కుటుంబానికి బిఆర్‌ఎస్ పార్టీ ఆర్థిక సాయం

**-దశదిన కర్మ సందర్భంగా రూ.1 లక్ష అందజేసిన పార్టీ నాయకులు**

**-కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి**



**పరకాల :**

ఇటీవల మరణించిన కీ.శే. మద్దెల బాబు కుటుంబానికి బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మద్దెల బాబు దశదిన కర్మ కార్యక్రమం సంద ర్భంగా బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పరకాల మండల పార్టీ అధ్యక్షుడు చిం తిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో, నాగారం గ్రామ సర్పంచ్ ఎరుకొండ రమాదేవి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్య నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు కలిసి మద్దెల బాబు కుటుంబ సభ్యులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేశారు.గ్రామ ప్రజలు, బిఆర్‌ఎస్ పార్టీ వార్డు సభ్యులు, పార్టీ కుటుంబ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దెల బాబు కుటుంబానికి తమ సంఘీభావం తెలిపారు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అందరూ కలిసి స్వచ్ఛందంగా సహాయం చేసి కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి మద్దెల బాబుకు నివాళు లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబం ఎదుర్కొంటున్న బాధను పంచుకుంటూ వారికి ధైర్యం చెప్పారు.అలాగే మాట్లాడుతూ, మద్దెల బాబు కుటుంబానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వారి పిల్లల చదువులకు అవసరమైన సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ భవిష్యత్తు కోసం పార్టీ తరఫున అన్ని విధాలుగా సహాయం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎరుకొండ ఆనందం, మాజీ ఎంపీటీసీ ఎరుకొండ సంతోషం, వార్డు సభ్యులు జూపాక కార్తీక్, పసుల కావ్య మధుకర్, పల్లెర్ల విద్యాసాగర్, పెరమాండ్ల సరిత శ్రీనివాస్, అరే లక్ష్మి సాంబరెడ్డి, తూముల ప్రవీణ్, గంద్రకోట తిరుపతి, జాలిగపు సంకీర్తన రాజు, అమ్మ బాబు, గ్రామ బిఆర్‌ఎస్ నాయకులు చిట్టీరెడ్డి రత్నాకర్ రెడ్డి, కునాటి శ్రీనాథ్ రెడ్డి, పసుల సుధాకర్, కుండే భద్రయ్య, కొత్త రవీందర్ రెడ్డి, వరికొల్ భద్రయ్య, వంగ రాజు, పసుల సంపత్, అల్లే రాజకుమార్, పాలకుర్తి దిలీప్, పోతారాజు మనోజ్ తదితరులు, బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్‌కు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కోసం అడుగులు వేగం

**- స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి వినతి**

**ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది. ఉప్పల్ ప్రాంతంలోని వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ బాగాయత్‌లో స్థలం కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతూ తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇప్పటికే ఉప్పల్ బాగాయత్‌లో ఎంఎంసీ భవనం నిర్మాణం కోసం 10 ఎకరాల



భూమిని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అదే దిశగా విద్యారంగ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం ఉప్పల్ మరియు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వేలాది మంది విద్యార్థులు డిగ్రీ విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రయాణ ఖర్చులు, ఇతర ఇబ్బందులతో చదువును కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఉంటే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, విద్యా అవకాశాలు మరింత అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.హెచ్‌ఎండీఏ బాగాయత్‌లో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటంతో అక్కడ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.

## వేంకటేశ్వర కాలనీ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**-రూ.60 లక్షలతో కొత్త భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులు ప్రారంభం**

**-జలమండలి సహకారంతో నిధులు మంజూరు చేయించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**

ఉప్పల్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ, సూర్యనగర్ కాలనీల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూగర్భ మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పుడల్లా మురుగునీరు రోడ్లపైకి పొంగి పొర్లడం, దుర్వాసన వ్యాపించడం, దోమల బెడద అధికమవడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మాస్టర్ షెఫ్ సంతోష్ దాబా సమీపంలోని వేంకటేశ్వర కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా మారి, ప్రజలు రోజువారీ జీవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాలనీలో భూగర్భ మురుగునీటి పైపులు పాడైపోవడం, సరైన నీటి పారుదల లేకపోవడంతో చిన్న వర్షానికే మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోవడం, రహదారులపైకి రావడం వంటి సమస్యలు నెలకొన్నాయి. దీని వల్ల స్థానికులు ఆరోగ్య సమస్యలతో పాటు దుర్వాసన, దోమల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూర్తి స్థాయి పరిష్కారం కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కాలనీ వాసులు సమస్యను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి



తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన పరమేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి, వేంకటేశ్వర కాలనీలో పర్యటించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్న అనంతరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు.అనంతరం జలమండలి అధికారులతో సమన్వయం చేస్తూ పలుమార్లు చర్చలు జరిపి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో వేంకటేశ్వర కాలనీతో పాటు సూర్యనగర్ కాలనీలో కొత్త భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో మురుగునీరు రోడ్లపైకి రావడం పూర్తిగా నివారించబడుతుందని, పారిశుద్ధ్య పరిస్థితులు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు పేర్కొంటున్నారు.ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడమే తమ బాధ్యత అని అన్నారు. వేంకటేశ్వర కాలనీ ప్రజలు పడుతున్న



ఇబ్బందులను స్వయంగా చూసిన తర్వాత ఈ సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని చర్యలు ప్రారంభించామని తెలిపారు. రూ.60 లక్షల వ్యయంతో నాణ్యమైన భూగర్భ మురుగునీటి లైన్ నిర్మాణం చేపడుతున్నామని, పనులు పూర్తయ్యాక వెంటనే సీసీ రోడ్డు పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చారు. ఇకపై వర్షం పడినా మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత పరిష్కారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ పనులు ప్రారంభం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో తమను వేధిస్తున్న సమస్యకు పరిష్కారం లభిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తూ, సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన పరమేశ్వర్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేసి కాలనీలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని కోరారు.ఈకార్యక్రమంలో కల్లూరి వేణు,నాయపు వెంకటేష్, కిషోర్,డేవిడ్, అయోధ్య, బిట్ల బాబు, సల్లా ప్రభాకర్ రెడ్డి, కడప నర్సింగ్ ఫరాన్, పవన్, నవీన్, చెన్‌రెడ్డి పాపిరెడ్డి, చంద్ర, మంగళ్, సుబ్బారావు,రమేష్

## హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు వేగం

**-రూ.37.5 కోట్లతో భారీ అభివృద్ధి పనులు ప్రారంభం**

**-చెరువు అలుగు తొలగింపు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని నాచారం డివిజన్‌లో ఉన్న హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. రూ.37.5 కోట్ల రూపాయల భారీ వ్యయంతో చేపడుతున్న చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా ఈరోజు చెరువు అలుగు తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ఆధునిక హంగులతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ పనులు స్థానిక ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి.ఈ సందర్భంగా ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులతో కలిసి చెరువు వద్దకు చేరుకుని అలుగు కూల్చివేత పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.చెరువులో నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు అలుగు తొలగింపు కీలకమని, ఈ ప్రక్రియ పూర్తికాగానే చెరువు త్వరలోనే ఖాళీ అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం చెరువు సుందరీకరణ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతాయని చెప్పారు. హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు చాలా కాలంగా పూడిక, ఆక్రమణలు, నిర్వహణ లోపంతో నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో చెరువు పరిసరాల్లో నీటి నిల్వలు, దుర్వాసన సమస్యలు తలెత్తడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును ఆధునికంగా తీర్చిదిద్ది ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.చెరువు సుందరీకరణలో భాగంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, చెరువు చుట్టూ అందమైన ప్రహరీ, నడక మార్గాలు, పచ్చదనం, విశ్రాంతి




వేదికలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో హెచ్‌ఎం టి నగర్ పెద్ద చెరువు భవిష్యత్తులో ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే కేంద్రంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువును అందమైన పర్యావరణ హిత ప్రదేశంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. చెరు వు ఖాళీ అయిన వెంటనే పనులు మరింత వేగంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజల కు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.అలాగే నాచారం డివిజన్ ప్రజల కు మరో శుభవార్తగా త్వరలోనే పటేల్‌కుంట చెరువు సుందరీకరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రాంతంలోని అన్ని చెరువులను పునరుద్ధరించి పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయడానికి కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.చెరువు ఖాళీ కావడంతో సుందరీకరణ పనులు త్వరలో ప్రారం భం కానున్న నేపథ్యంలో నాచారం డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటి నగర్, బాపూజీ నగర్, సరస్వతీ నగర్, ఇందిరానగర్, శ్రీ రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ తదితర ప్రాంతాల కాలనీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్‌తో పాటు వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co